www.aakshitha.com
People's voice
అక్షిత
జాతీయ దినపత్రిక
AKSHITHA NATIONAL DAILY
తెలంగాణ దిక్సూచి
మంగళవారం | 17 | ఫిబ్రవరి | 2026 | పేజీలు: 08



# సమిష్టి కృషితోనే సక్సెస్

### ఈ సక్సెస్ సీఎం రేవంత్ కు కానుక

### కొత్త మేయర్ మమత, డిప్యూటీ మేయర్ సురేంద్ర రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి



**జడ్చర్ల, అక్షిత న్యూస్ :** మహబూబ్ నగర్ కార్పొరేషన్ లో మేయర్, డిప్యూటీ మేయర్ పదవులను కాంగ్రెస్ కైవశం చేసుకోవడం పట్ల జడ్చర్ల ఎమ్మెల్యే, మహబూబ్ నగర్ కార్పొరేషన్ ఎన్నికల ఇంచార్జి జనంపల్లి అనిరుధ్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. మహబూబ్ నగర్ కార్పొరేషన్ ను కాంగ్రెస్ ఖాతాలో వేయడం ద్వారా సీఎం రేవంత్ రెడ్డికి కానుకగా ఇస్తున్నామని ఆయన పేర్కొన్నారు. మహబూబ్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కు ఈరోజు జరిగిన ఎన్నికలలో మున్సిపల్ కార్పొరేషన్ ..మిగతా 2లో



# మంచి నడవడికతోనే ప్రజల మన్ననలు

### విశిష్ట సేవలందించి గొప్ప పేరు తెచ్చుకోవాలి

### చరిత్రలో నిలిచేలా పనిచేయాలి

### నూతన మేయర్‌గా బుర్రి చైతన్యరెడ్డి, డిప్యూటీ మేయర్‌గా అస్రఫ్ అలీ

### మంత్రి కోమటిరెడ్డి



**నల్గొండ టౌన్, అక్షిత న్యూస్ :** నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ కు నూతనంగా ఎన్నికైన మొదటి కార్పొరేటర్లు చరిత్రలో నిలిచిపోయేలా పని చేయాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్లు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ,ప్రజలకు మంచి సేవలు అందించి గొప్ప పేరు తెచ్చుకోవాలని, పదవులు శాశ్వతం కాదని, ప్రజల నమ్మకానికి అనుగుణంగా పనిచేసే మంచి నడవడికతో, అన్ని వర్గాల ప్రజల మన్ననలను చూరగొనాలని, సమస్యలను మేయర్ తో పాటు, అవసరమైతే తన దృష్టికి తీసుకురావాలని మంత్రి కోరారు. సోమవారం నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ సమావేశ మందిరంలో నిర్వహించిన నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికలలో ఆయన పాల్గొనడమే కాకుండా, నల్గొండ కార్పొరేషన్ నూతన కార్పొరేటర్ల ..మిగతా 2లో

# క్యాంపులు వీడి పుర పాలికకు చేరి

### కొలువు దీరిన కొత్త పాలక మండలి

### చైర్ పర్సన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్ల ప్రమాణ స్వీకారం

### చైర్ పర్సన్, వైస్ చైర్మన్‌ల ఎన్నికకు ఇద్దరేసి ప్రతిపాదన

### సీట్లు, పదవుల పంపకంలో సమన్యాయం ప్రదర్శించిన కాంగ్రెస్ నేతలు




**సూర్యాపేట, అక్షిత ప్రతినిధి :** సూర్యాపేట జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో కొత్త పాలక మండలి కొలువు తీరింది. క్యాంపు రాజకీయాలను వీడిన కౌన్సిలర్లు నేరుగా మున్సిపల్ కార్యాలయంలోకి వచ్చి తమకి కేటాయించిన స్థానాల్లో ఆసీనులయ్యారు.అనంతరం రాజ్యాంగ బద్ధంగా చైర్మన్లు, వైస్ చైర్మన్ లు,కౌన్సిలర్లుగా ..మిగతా 2లో

# బుల్లెట్ దిగిందా లేదా చూసుకోండి..!

### ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి




**పటాన్‌చెరు, అక్షిత ప్రతినిధి :** కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి యూటర్న్‌తో సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గంలో బీఆర్ఎస్ తిరుగులేని విజయం సొంతం చేసుకుంది. మున్సిపల్ ఎన్నికల్లో గుమ్మడిదల, జిన్నారం, గడ్డపోతారం, ఇంద్రేశం మున్సిపాలిటీలను స్పష్టమైన ఆధిక్యంతో కైవసం చేసుకుంది. తాజాగా, ఇస్నాపూర్ మున్సిపాలిటీ చైర్మన్ పీఠాన్ని సైతం చేజిక్కించుకుంది. మున్సిపల్ చైర్మన్‌గా మోతే సుమలత, వైస్ చైర్మన్‌గా పట్లోళ్ల మాధవి ఎన్నికయ్యారు. ఎక్స్ అఫిషియో ..మిగతా 2లో

# ఉత్కంఠకు తెర తొలి చైర్మన్‌గా ఆకాష్

### చైర్మన్ ఎన్నికలో హైడ్రామా

### నాటకీయ పరిణామాల మధ్య చైర్మన్‌గా బిఆర్ఎస్ అభ్యర్థి మెంగ్రే ఆకాష్



**ఆసిఫాబాద్, అక్షిత ప్రతినిధి:** ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలో హై డ్రామా చోటుచేసుకుంది. పలు నాటకీయ ..మిగతా 2లో

## సమిష్టి కృషితోనే సక్సెస్

మొదటి పేజీ తరువాయి...

కాంగ్రెస్ పార్టీకి చెందిన టి మమత మేయర్ గా, సురేందర్ రెడ్డి డిప్యూటీ మేయర్ గా ఎన్నిక కావడం పట్ల అనిరుధ్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. మహబూబ్ నగర్ మున్సిపల్ ఎన్నికలలో జడ్చర్ల నియోజకవర్గానికి చెందిన అనేకమంది నాయకులు, కార్యకర్తలు అన్ని డివిజన్ లలో ప్రచారం చేసి, మహబూబ్ నగర్ లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించారని, వారందరికీ తాను ధన్యవాదాలు తెలుపుతున్నానని అనిరుధ్ రెడ్డి చెప్పారు. కొత్తగా మేయర్, డిప్యూటీ మేయర్ గా ఎంపికైన మమత, సురేందర్ లను అనిరుధ్ రెడ్డి అభినందించారు. అదే విధంగా ఈ ఎన్నికలలో పదవుల కోసం ఆశపెట్టుకొని పదవులు రాని కారణంగా నిరాశ చెందిన వారు ఎవరైనా ఉంటే, అలాంటి వారి గురించి అధిష్టానం దృష్టికి తీసుకెళ్తానని, అలాంటి వారికి కూడా భవిష్యత్తులో మంచి అవకాశాలను కల్పించేలా చూస్తానని ఆయన హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీలో పని చేసే ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని, ఈ విషయంలో ఎవరు నిరాశ చెందాల్సిన అవసరం లేదని అనిరుధ్ రెడ్డి పేర్కొన్నారు.

## బుల్లెట్ దిగిందా లేదా చూసుకోండి..!




మొదటి పేజీ తరువాయి...

ఓటు వేసి తిరిగి వెళ్తున్న గూడెం మహిపాల్ రెడ్డిని బీఆర్ఎస్ కార్యకర్తలు ఓటింగ్ ఎలా జరిగిందని ప్రశ్నించగా.. పరోక్షంగా కాంగ్రెస్ పార్టీ,స్థానిక నేతను ఉద్దేశించి ఆయన 'బుల్లెట్ దిగిందా లేదా'అంటూ హాట్ కామెంట్స్ చేశారు.కాగా, ఇస్నాపూర్ మున్సిపాలిటీలో మొత్తం 26 వార్డులు ఉండగా.. కాంగ్రెస్ 10, బీఆర్ఎస్ 12, స్వతంత్రులు 4 వార్డుల్లో విజయం సాధించారు. అందులో ముగ్గురు ఇండిపెండెంట్లు కాంగ్రెస్‌లోకి వెళ్లగా ఒకరు బీఆర్ఎస్‌లో చేరారు.దీంతో రెండు పార్టీల సంఖ్య 13కు చేరింది.దీంతో మున్సిపాలిటీ కైవసం చేసుకుంటామని ధీమాతో ఉన్న కాంగ్రెస్‌కు ఎంపీ రఘునందన్ రావు షాకిచ్చారు. ఆయన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డితో ఒకే వాహనంలో ఇస్నాపూర్ మున్సిపల్ కార్యాలయానికి వచ్చి బీఆర్ఎస్‌కు అనుకూలంగా ఎక్స్ అఫీషియో ఓటు వేయడంతో ఇస్నాపూర్ మున్సిపాలిటీ గులాబీ వశమైంది.

## క్యాంపులు వీడి పుర పాలికకు చేరి

మొదటి పేజీ తరువాయి...

ప్రమాణ స్వీకారం చేశారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సూర్యాపేట మున్సిపాలిటీ పాలక మండలి సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమం ఎన్నిక అధికారి సూర్యాపేట ఆర్డీవో వేణు మాధవరావు, సహాయ ఎన్నిక అధికారి, సూర్యాపేట మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి నూతనంగా కౌన్సిలర్ గా ఎంపికైన గౌరవ సభ్యులు ఉదయం 10 :.45 నిమిషాలకు మీటింగ్ హాల్లోకి అడుగు పెట్టారు.అనంతరం మున్సిపల్ కార్యాలయ రిజిస్టర్ లో ఎన్నికలలో విజయం సాధించిన 48 మంది సభ్యుల పేర్లను నమోదు చేసుకుని సంతకాలు సేకరించారు.అట్టి సభ్యుల చేత ముందుగా ప్రమాణ స్వీకారం చేయించారు.ఈ సందర్భంగా ఎన్నిక అధికారులు వారికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాస్టర్ ట్రైనర్ చే చైర్మన్ ఎన్నిక, వైస్ చైర్మన్ ఎంపికపై నూతనంగా ఎంపికైన కౌన్సిలర్లకు అవగాహన కల్పించారు. మధ్యాహ్నం 12:30 గంటలకు చైర్మన్,వైస్ చైర్మన్ ఎన్నికను నిర్వహించారు. చైర్మన్ గా మొరిశెట్టి నివేదిత(46 వ వార్డు) పేరును కుమ్మరికుంట్ల వేణుగోపాల్ (47 వ వార్డు), గుణగంటి హేమ (44 వ వార్డు) సభ్యురాలు సూచించగా వీరికి 31 మంది కాంగ్రెస్ సభ్యులు, ముగ్గురు ఇండిపెండెంట్ సభ్యులు చేతులెత్తి ఆమోదం తెలిపారు.

# మంచి నడవడికతోనే ప్రజల మన్ననలు

మొదటి పేజీ తరువాయి...

ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

ప్రమాణ స్వీకార అనంతరం నూతన కార్పొరేటర్లను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ నల్గొండలో సామాజిక న్యాయం చేసేందుకు డిప్యూటీ మేయర్ పదవిని మైనార్టీ వర్గాలకు అందించడం జరిగిందని, కొత్తగా ఎన్నికైన కార్పొరేటర్లు అందరూ కలిసి పనిచేయాలని, పట్టణ అభివృద్ధి మీ చేతుల్లో ఉందని, అందరూ కలిసికట్టుగా పనిచేస్తే మరింత అభివృద్ధి సాధిస్తామని, పేదల సంక్షేమం విషయంలో రాజీ పడవద్దని పిలుపునిచ్చారు.

రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు ఎన్నో అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలు అమలుచేస్తున్నదని, రేషన్ కార్డులు ఇవ్వడమే కాకుండా బీదలందరికి ఆరు కేజీల సన్నబియ్యాన్నిస్తున్నదని, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పేరుమీద ఇప్పటివరకు 5000 కోట్ల రూపాయలు విద్యుత్తు బోర్డుకు చెల్లించడం జరిగిందని తెలిపారు. తన స్వంత నిధులతో నల్గొండ ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రికి లాప్రోస్కోపిక్ యంత్రం తెప్పించడమే కాకుండా, మాన్యం చెల్క ప్రభుత్వ ఆసుపత్రి నూతన భవనాన్ని నిర్మించడం జరుగుతున్నదని, అది పూర్తయ్యే దశలో ఉందని, బొట్టుగూడ పాఠశాలలాగే మరో నాలుగు పాఠశాలలను అభివృద్ధి చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. నల్గొండ అభివృద్ధికి నిధులకు కొరత లేదని, త్వరలోనే నల్గొండ మున్సిపాలిటీకి 1137 కుట్టుమిషన్లు రానున్నాయని, వీటిని అన్ని వార్డులకు సమానంగా పంచుతామని, పేద మహిళలకు వీటిని అందించాలని, కార్పొరేటర్లు అందరు కలిసి పనిచేస్తే తక్షణమే ముఖ్యమంత్రి ద్వారా 100 కోట్ల రూపాయలు నల్గొండ



కార్పొరేషన్ కు తెప్పించే ఏర్పాటు చేస్తానని ఆయన తెలిపారు. కాగా నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ నూతన మేయర్ గా బుర్రి చైతన్యరెడ్డి, డిప్యూటీ మేయర్ గా అస్రఫ్ అలీ మొహమ్మద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా వ్యవసాయ అధికారి, మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికల ప్రత్యేక అధికారి శ్రవణ్ ఆధ్వర్యంలో మేయర్, డిప్యూటీ మేయర్ ల ఎన్నికలను నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ సమావేశ మందిరంలో నిర్వహించడం జరిగింది. మేయర్, డిప్యూటీ మేయర్లను కార్పొరేటర్లందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రత్యేక అధికారి ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మేయర్,డిప్యూటీ మేయర్లతో పాటు నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్లందరి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రమాణ స్వీకారోత్సవం తర్వాత కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ బి.చంద్ర శేఖర్ మాట్లాడుతూ మొదటిసారిగా మేయర్, డిప్యూటీ మేయర్ తో పాటు, కార్పొరేటర్లైన అందరికి శుభాకాంక్షలు తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ప్రజల వద్దకు తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్పొరేటర్ల పై ఉందన్నారు. అన్ని డివిజన్లను సమానమైన అభివృద్ధికి కృషి చేయాలని, ప్రస్తుతం పురోగతిలో ఉన్న పథకాలన్నీ అందరి సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని, ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యటించి పనులను తనిఖీ చేస్తూ చట్టానికి లోబడి ప్రజలతో మమేకమై పనులు చేపట్టాలని సూచించారు. నల్గొండ కార్పొరేషన్ నూతన మేయర్ గా ఎన్నికైన బుర్రి చైతన్యరెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి నల్గొండ కార్పొరేషన్ మేయర్ గా పదవి బాధ్యతలు అప్పగించినందుకు కష్టపడి పనిచేసి ప్రజలకు మేలు చేస్తానని అన్నారు. తనకు మేయర్ అవకాశాన్ని కల్పించిన అందరికీ ఆమె కృతజ్ఞతలు తెలిపారు .తనకు తన భర్త కుటుంబానికి రాజకీయాలలో ఉన్న అనుభవాన్ని ఆధారం చేసుకుని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో నల్గొండ పట్టణాన్ని స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఇకపై నల్గొండ ప్రజలు సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని, తద్వారా మంత్రి దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. నల్గొండ పట్టణ అభివృద్ధికి రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి ఇదివరకే 2200 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ ,ఘాట్ రోడ్లు ,సిసి రోడ్లు వేయిస్తున్నారని, అంతేకాక మంత్రి సొంత నిధులను వెచ్చించి విద్య, వైద్య సౌకర్యాలు కల్పిస్తున్నారని తెలిపారు.

డిప్యూటీ మేయర్ అశ్రఫ్ అలీ మహమ్మద్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో డిప్యూటీ మేయర్ పదవినిచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు .

ఈ సందర్భంగా ఆర్ అండ్ బి శాఖ మంత్రి, జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ శరత్ చంద్రలు నూతన మేయర్ బుర్రి చైతన్య రెడ్డి, డిప్యూటీ మేయర్ అశ్రఫ్ అలీ మహమ్మద్, నూతన కార్పొరేటర్ లందరికీ పుష్పగుచ్ఛాలు అందించి శాలువా మొమెంటులతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు మాజీ ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

### ఉత్కంఠకు తెర

# తొలి చైర్మన్‌గా ఆకాష్

మొదటి పేజీ తరువాయి...

పరిణామాల మధ్య బిఆర్ఎస్ కు చెందిన మెంగ్రే ఆకాష్ ఆసిఫాబాద్ మున్సిపాలిటీ తొలి చైర్మన్ గా , ఎండి. అహ్మద్ వైస్ చైర్మన్ గా ఎన్నికయ్యారు.

**చైర్మన్ ఎన్నికలో నాటకీయ పరిణామాలు**

ఆసిఫాబాద్ మున్సిపాలిటీ ఏర్పాటు అయ్యాక జరిగిన తొలి ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు తొలిసారి బల్దియా పీఠం దక్కించుకోవాలని పోటాపోటీగా ప్రయత్నాలు ముమ్మరం చేశాయి. చైర్మన్ పదవి బీసీ జనరల్ కు రిజర్వ్ కాగా, ఇరు పార్టీలు ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని జవసత్వాలన్నీ ఒడ్డి బరిలో దిగారు. ఫలితాలు ఫిబ్రవరి 13 న వెలువడగా 20 వార్డులకు గాను బి ఆర్ ఎస్ పార్టీ 9 స్థానాలను చేజిక్కించుకొని అధిక స్థానాలు దక్కించుకున్న పార్టీ గా నిలవగా, కాంగ్రెస్ పార్టీకి 7 స్థానాలు దక్కాయి. ఇండిపెండెంట్ గా నలుగురు అభ్యర్థులు గెలుపొందారు. చైర్మన్ పదవి దక్కించుకునేందుకు కావాల్సి 11 వార్డుల మ్యాజిక్ ఫిగర్ ను ఏ పార్టీ కైవశం చేసుకోకపోవడంతో హంగ్ అనివార్యంగా మారింది. ఇరు పార్టీలు తమ తమ పార్టీల నుండి గెలిచిన అభ్యర్థులను క్యాంపులకు తరలించి ఇండిపెండెంట్ అభ్యర్థులను తమ వైపు తిప్పుకునేందుకు ప్రయత్నాలు మొదలెట్టారు. బిఆర్ఎస్ పార్టీకి ఎక్స్ అఫిషియో సభ్యురాలిగా ఎమ్మెల్యే కోవ లక్ష్మీ ఓటు ఉండటంతో చైర్మన్ పదవి




దక్కించుకునేందుకు ఒక్కరి మద్దతు మాత్రమే అవసరం ఏర్పడింది. కాగా ఇండిపెండెంట్ అభ్యర్థులుగా గెలిచిన వారందరూ కాంగ్రెస్ రెబల్స్ గా ఉండటంతో ఆ పార్టీకి మొగ్గు చూపే అవకాశాలు ఉన్న నేపథ్యంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి స్వయంగా రంగంలో దిగి ఇండిపెండెంట్ అభ్యర్థులను కలిసి మద్దతు ఇస్తే చైర్మన్ చేస్తామని ప్రకటించారు. అయినప్పటికీ కాంగ్రెస్ నాయకత్వం వారిని తమ స్వంత గూటి వైపు తిప్పుకోవడంలో కృతకృత్యులయ్యారు. వారందరినీ క్యాంపుకు తరలించి చైర్మన్ స్థానంపై ధీమాగా ఉన్నారు.

**చక్రం తిప్పిన ఎమ్మెల్యే కోవ లక్ష్మీ**

చైర్మన్ స్థానం దక్కించుకునేందుకు తన ఎక్స్ అఫిషియో ఓటుతో పాటుఒక్క అభ్యర్థి మద్దతు అవసరం ఉండగా ఇండిపెండెంట్ అభ్యర్థులకు చైర్మన్ పదవి కట్టబెట్టేందుకు సిద్ధమైనప్పటికీ వారి మద్దతు లభించకపోవడంతో ఇక కాంగ్రెస్ గెలుపు ఖాయం అన్న తరుణం లో ఎవరు ఊహించని విధంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గుండా స్నేహను తమ వైపు తిప్పుకోవడంలో ఎమ్మెల్యే చాణక్య నీతిని ప్రదర్శించారని సర్వత్ర అభినందనలు వ్యక్తం అవుతున్నాయి. తమకు అవసరం ఉన్న నలుగురు ఇండిపెండెంట్ అభ్యర్థులను క్యాంప్ కు తరలించి ఎన్నిక రోజైన సోమవారం నేరుగా మున్సిపల్ కార్యాలయానికి తీసుకు వచ్చి గెలుపుపై ధీమాగా ఉన్న కాంగ్రెస్ నాయకత్వానికి విప్ జారీ చేసినప్పటికీ తమ పార్టీలోని సభ్యురాలే ప్లేట్ ఫిరాయించి ప్రత్యర్థులకు ఓటు వేసి గెలిపించడం మింగుడు పడకుండా పోయింది. మున్సిపల్ చైర్మన్ పదవిని దక్కించుకోవడం ప్రత్యర్థుల అంచనాలకు అందకుండా వ్యూహాత్మకంగా వ్యవహరించి ప్రతికూల పరిస్థితుల్లో తమ అభ్యర్థికి పట్టం కట్టి పార్టీని గెలిపించుకొని ఆసిఫాబాద్ పై తన పట్టును మరోసారి నిలబెట్టుకొని ఎమ్మెల్యే కోవ లక్ష్మీ తన చాణక్య నీతిని పునరావృతం చేశారనడంలో అతిశయోక్తి లేదు.

# కోదాడ మునిసిపల్ చైర్ పర్సన్‌గా ఎర్నేని కుసుమ వెంకటరత్నం బాబు..

**మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే పద్మావతి కృషితోనే చైర్పర్సన్ పదవికి ఎంపిక.....**

**కోదాడ కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ కౌన్సిలర్ లకు ధన్యవాదాలు....**

**కోదాడ పట్టణ అభివృద్ధికి కట్టుబడి పని చేస్తా... కుసుమ వెంకటరత్నం బాబు...**



**కోదాడ అక్షిత ప్రతినిధి:** కోదాడ మున్సిపల్ చైర్ పర్సన్ ఎంపిక పీట ముడి ఎట్టకేలకు అధిష్టానం విప్పింది. కోదాడ పీఠంపై మాజీ సర్పంచ్ ఎర్నేని కుసుమ వెంకటరత్నం బాబు కు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఎమ్మెల్యే పద్మావతి అంగీకారం తెలుపుతూ కూర్చోబెట్టారు. గత రెండు రోజులుగా హైదరాబాదులోని క్యాంపులో పోటీలో ఉన్న అభ్యర్థులందనీ సమన్వయం చేసి ఎమ్మెల్యే పద్మావతి ఈ నిర్ణయంతీసుకున్నారు.ఎమ్మెల్యే పద్మావతి  కోదాడ మున్సిపాల్టీ చేజార కుండా ఉండేందుకు సాహసోపేత మైన కృషి చేశారు.ఎర్నేని వెంకటరత్నం బాబు అపార రాజకీయ అనుభవం , కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి చేస్తున్న కృషిని మంత్రి ఉత్తమ్ ఎమ్మెల్యే పద్మావతి లు గుర్తించారు. ఇదే క్రమంలో బాబు సహితం అగ్ర నాయకుల అందర్నీ సమన్వయం చేసుకొని పదవిని దక్కించుకున్నారు. ఎర్నేని బాబు మాజీ సర్పంచ్ గా, మార్కెట్ కమిటీ చైర్మన్ గా పదవులు నిర్వహించడంతోపాటు పార్టీ పరంగా అనేక పదవులు చేపట్టారు. మున్సిపల్ ఎన్నికల ముందు నుండే ఆయన ఈ పదవిని ఆశిస్తూ అదే ప్రయత్నంలో ఉన్నారు. రిజర్వేషన్ జనరల్ మహిళా కావడంతో తన శ్రీమతి కుసుమ ను కౌన్సిలర్ గా పోటీ చేయించి ఏకగ్రీవంగా విజయం సాధించారు. ఎమ్మెల్యే పద్మావతి, మంత్రి ఉత్తమ్  లు సహితం బాబు కు ప్రాధాన్యత ఇవ్వాలనే మాట కు అనుకూలంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. అంతే కాక క్యాంపు నుండి ఎమ్మెల్యే పద్మావతి, బస్సు లో కౌన్సిలర్ తో కలిసి కోదాడ మున్సిపాలిటీ కి వచ్చి ప్రమాణ స్వీకారం ముగిసే వరకు ఉన్నారు. కోదాడ చరిత్ర లోనే ఎమ్మెల్యే  కృషి చిరస్మరణీయంగా నిలిచి పోతుందని పలువురు ఎమ్మెల్యే పద్మావతిని అభినందించారు.కాగా ఎర్నేని వెంకట్ రత్నం బాబు తమ కు అవకాశం ఇచ్చిన మంత్రి ఉత్తమ్ ఎమ్మెల్యే పద్మావతి తో పాటు,స్థానిక నాయకులకు, కౌన్సిలర్ లకు ధన్య వాదాలు తెలిపారు. పట్టణ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.



ప్రమాణ స్వీకారం.....లాంఛనా ప్రాయంగా జరిగిన ఎన్నికలో కౌన్సిల్ సభ్యులు చైర్ పర్సన్ గా కుసుమ వెంకట్ రత్నం బాబు ను, వైస్ చైర్మన్ దేవర పల్లి మహేశ్వరి ని ఎన్నుకున్నారు. అనంతరం ఆర్డీఓ సూర్య నారాయణ ప్రమాణ స్వీకారం చేయించారు. కాగా కుసుమ బాబు ప్రమాణ స్వీకారం కు నాయకులు కార్యకర్తలు భారీగా తరలి వచ్చారు. పూల మాలలు, శాలు వాలతో బొకే లతో నూతన చైర్మన్ ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమాదేవి, మాజీ ఎడమ కాలువ చైర్మన్ చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి, గ్రంథాలయ జిల్లా అధ్యక్షులు వంగవీటి రామారావు ,మాజీ కోఆప్షన్ సభ్యులు అల్తాఫ్ హుస్సేన్, కాంగ్రెస్ నాయకులు రావెళ్ల కృష్ణారావు ,ఆర్యవైశ్య జిల్లా అధ్యక్షులు నాయకులు వెంపటి వెంకటేశ్వరరావు పార్టీ శ్రేణులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు







# రాష్ట్ర స్థాయి పోలీస్ క్రీడల్లో సత్తా చూపాలి

**వరంగల్ సిపి**

**వరంగల్, అక్షిత బ్యూరో:** నాల్గవ తెలంగాణ రాష్ట్ర పోలీస్ డ్యూటీ మీట్ క్రీడల్లో వరంగల్ కమిషనరేట్ పోలీసులు సత్తా చాటాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సూచించారు.

మంగళవారం నుండి సైబరాబాద్ కమిషనరేట్ లో ప్రారంభమయ్యే  తెలంగాణ పోలీస్ స్పోర్ట్స్ మీట్ పోటీల్లో, క్రీడా గ్రామంలో ఎగురవేసే వరంగల్ పోలీస్ కమిషనరేట్ క్రీడా పతకాన్ని పోలీస్ కమిషనర్ పోలీస్ అధికారులు, క్రీడాకారులతో కలసి ఆవిష్కరించారు. అనంతరం ఈ పోటీల్లో పాల్గొనే




పోలీస్ క్రీడాకారులకు క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ చేతుల మీదుగా ట్రాక్ సూట్ తో పాటు స్పోర్ట్స్ షూ, టీ షర్ట్ అందజేశారు.క్రీడాకారులతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ రాష్ట్ర పోలీస్ క్రీడల్లో వరంగల్ పోలీస్ క్రీడా కారులు తమ సత్తా చూపాలని, పోలీసులు శాంతి భద్రతల్లోనే కాదు క్రీడల్లో కూడా రాణించగలరని, క్రీడల్లో ప్రతిభ కనబరిచిన సిబ్బందికి శాఖపరమైన గుర్తింపు వుంటుందని సీపీ తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఏసీపి నాగయ్య, ఆర్.ఐ సతీష్, ఆర్. ఎస్.ఐ శ్రవణ్ కుమార్, క్యాంపు క్లర్క్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

## రహదారుల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి

**సర్పంచ్ ఇడం రాధా శ్రీనివాస్**




**రామన్నపేట అక్షిత ప్రతినిధి:** రామన్నపేట చౌటుప్పల్ ప్రధాన రహదారి వెల్లంకి గ్రామంలో పెరిగిపోయిన కంపచెట్లను తొలగిస్తూ గ్రామ సర్పంచ్ ఇడం రాధా శ్రీనివాస్ స్వయంగా పర్యవేక్షణలో పరిశుభ్రత పనులు చేపట్టారు. రహదారికి ఇరువైపులా విస్తరించిన కంపచెట్లు వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తున్న నేపథ్యంలో ఈ చర్యలు చేపట్టడం చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామానికి నలువైపులా ఉన్న అన్ని రోడ్ల పక్కన పెరిగిన కంపచెట్లను పూర్తిగా తొలగించి రహదారులను పరిశు భ్రంగా, సురక్షితంగా ఉంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామంలో ఎక్కడైనా రోడ్లపై చెట్లు పడిపోయినా, చెత్తాచెదారం పేరుకుపోయినా వెంటనే జెసిబి సహాయంతో తొలగించాలని గ్రామపంచాయతీ సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

## నల్లమల్ల కమలాదేవి సేవలు మరవలేనివి...

**సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు...**




**సూర్యాపేట, అక్షిత ప్రతినిధి :** తెలంగాణ సాయుధ పోరాట యోధులు నల్లమల్ల గిరి ప్రసాద్ సతీమణి కామ్రేడ్ నల్లమల్ల కమలాదేవి మరణం సిపిఐ పార్టీకి తీరనిలోటని సూర్యాపేట సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు.సోమవారం జిల్లా కేంద్రంలో ధర్మ బిక్షం భవనంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాట ఉద్యమ సమయంలో ఆయన వెంట ఉండి పని చేశారని అన్నారు.ఆయన సహధర్మచారిగా ఆయన అడుగుజాడల్లో పయనిస్తూ గిరి ప్రసాద్ అజ్ఞాతంలో ఉన్న సమయంలో ధైర్యంతో ఉండి పార్టీ అభ్యున్నతికి పాటు పడ్డారని కొనియాడారు.ఆయన ఆశయ సాధన కోసం ప్రతి కార్యకర్త స్ఫూర్తితో ముందుకెళ్లాలున్నారు. వారి మరణానికి జిల్లా పార్టీ పక్షాన విప్లవ జోహార్లు అర్పిస్తూ వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని,సంతాపాన్ని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణం కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు,నాయకులు బొమ్మగాని శ్రీనివాస్,చామల అశోక్ కుమార్,మాజీ కౌన్సిలర్ అనంతుల మల్లేశ్వరి,ఎడెల్లి శ్రీకాంత్,దేశగాని హేమలత తదితరులు పాల్గొన్నారు.

www.aakshitha.com People's voice అక్షిత AKSHITHA NATIONAL DAILY



## తిరుమలగిరి మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్ ఏకగ్రీవంగా ఎన్నిక..

**బిఆర్ఎస్ కైవసం**

**చైర్మన్ సంకెపల్లి రఘునందన్ రెడ్డి**

**వైస్ చైర్మన్ ఏమోజు గోవిందమ్మా**





**తిరుమలగిరి, అక్షిత ప్రతినిధి:** సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మున్సిపాలిటీ చైర్మన్ సంకేపల్లి రఘునందన్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నుకయ్యారు. తిరుమలగిరి 15వ వార్డుల్లో బిఆర్ఎస్ 10 స్థానాల్లో గెలుపొందగా, కాంగ్రెస్ – 05 అభ్యర్థులు గెలిచారు. సోమవారం మున్సిపాలిటీ సమావేశ మందిరంలో జిల్లా ఎన్నికల అధికారి గెలిచిన అభ్యర్థులతో ప్రమాణ స్వీకారం చేయించారు.

అనంతరం చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వహించారు. కాగా బి ఆర్ ఎస్ పార్టీ నుంచి చైర్మన్ అభ్యర్థిగా 14వ వార్డు కౌన్సిలర్ సుంకేపల్లి రఘునందన్ రెడ్డి ను సూచించిన కౌన్సిలర్ భూక్య యాకుబ్ నాయక్ బలపరిచిన మరో కౌన్సిలర్ పత్తేపురం త్రిశూల్. వైస్ చైర్మన్ గా 11వ వార్డు కౌన్సిలర్ ఏమోజు గోవిందమ్మా ను కోరం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాంగ్రెస్ పార్టీ వార్డు సభ్యులు గైజరయ్యారు.

## మహబూబ్ నగర్ కార్పొరేషన్ తొలి మేయర్‌గా మమత శ్రీనివాస్ ముదిరాజ్

**కాంగ్రెస్ పార్టీ పట్ల హర్షం వ్యక్తం చేసిన ముదిరాజ్ జేఏసీ నాయకులు మైత్రి యాదయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పెద్ద విజయ్ కుమార్ ముదిరాజ్**




**మహబూబ్ నగర్, అక్షిత న్యూస్:** మహబూబ్ నగర్ కార్పొరేషన్ తొలి మేయర్ గా అప్పనపల్లి మూడో మూడో డివిజన్ నుంచి గెలుపొందిన గుమాల్ మమత శ్రీనివాస్ ముదిరాజ్ ని ఎన్నిక చేసినందున కాంగ్రెస్ పార్టీకి మరియు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డికి మరియు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులకు మద్దతు ప్రకటించిన కార్పొరేటర్ లందరికీ ముదిరాజ్ జేఏసీ నాయకులు మైత్రి యాదయ్య ముదిరాజ్ మరియు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పెద్ద విజయ్ కుమార్ ముదిరాజ్ ధన్యవాదాలు తెలుపుతూ మున్సిపల్ కార్పొరేషన్ ముందు టపాకాయలు పేల్చి ఆనందం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా కేంద్రంలోని ముదిరాజ్ సామాజిక వర్గానికి చేసిన మేలును ఎప్పటికీ మర్చిపోలేనిదని రానున్న ఎన్నికల్లో మరియు పార్టీకి ఎల్లప్పుడు తమ సామాజిక వర్గం నుండి మద్దతు తెలుపుతామని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో రాచాల మురళి, ముసంగి వెంకటేష్, తెలుగు గూడెం ఆంజనేయులు, అప్పనపల్లి ఆంజనేయులు, బాల గోపి తదితరులు పాల్గొన్నారు.

# గొప్ప దైవజనులు బిషప్ జయరాజు..

**సి ఎఫ్ జి చర్చి వ్యవస్థాపకులు అనారోగ్యంతో మృతి....**

**ఘన వీడ్కోలు పలికిన వేలాది క్రైస్తవులు**

**జయరాజు భౌతికకాయంపై పుస్పగుచంతో నివాళులర్పించిన బిషప్ దుర్గం ప్రభాకర్....**



**సూర్యాపేట , అక్షిత ప్రతినిధి :** సి ఎఫ్ జి చర్చి వ్యవస్థాపకులు, గొప్ప దైవజనులు,సీనియర్ పాస్టర్ బిషప్ సిహెచ్.జయరాజు మృతి విచారకరమని తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి,బెతస్త మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు సూర్యాపేట బిషప్ దుర్గం ప్రభాకర్ అన్నారు.నల్లగొండ జిల్లా నార్కట్ పల్లిలోని సి ఎఫ్ జి చర్చిలో జయరాజు ప్రార్ధివ దేహానీపై పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం ఆయన జరయరాజు కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జయరాజు గత కొంతకాలంగా ఆనారోగ్యంతో హైదరాబాద్ చికిత్స పొందుతూ మృత్యువాత పడ్డారని అన్నారు. ఆయన మృతి ఉమ్మడి నల్గొండ జిల్లాను కలిసి వేసిందని ఆవేదన వ్యక్తం చేశారు.ఆయన వేల మంది ఆత్మీయులను సంపాదించారని కొనియాడారు.జయరాజుకి నివాళులు అర్పించిన వారిలో చార్లెట్ చారిటబుల్ ఫౌండేషన్ సూర్యాపేట వ్యవస్థాపకులు బ్రదర్ జాటోత్ డేవిడ్ రాజు,ఉమ్మడి నల్గొండ జిల్లా కన్వీనర్ పాస్టర్ చింత మనిషే,జిల్లా కాంగ్రెస్ పార్టీ క్రైస్తవ నాయకులు పోకల అశోక్, సీనియర్ నాయకులు మర్రి రాజు, నకిరేకల్ పెలోషిప్ పాస్టర్స్ అధ్యక్షులు రెవ,వేముల హనోక్, బిషప్ వై.సమర్పణ కుమార్ జాన్సీ రాణి తుంగతుర్తి అధ్యక్షులు బాకీ పరంజ్యోతి,చింత సుధాకర్, ఫాస్టర్లు రావుల అబ్రామ్, ఏసురత్నం,జీవ ప్రకాష్ బల్లెం, మోజెష్,కత్తుల యెహోవా దాసు తదితరులు ఉన్నారు.

## భైంసా పురపాలక సంఘానికి నూతన చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నిక

**స్వతంత్రులకు బీజేపీ, కాంగ్రెస్ మద్దతు**



**నిర్మల్ జిల్లా/భైంసా. అక్షిత బ్యూరో,ఫిబ్రవరి 16:** నిర్మల్ జిల్లాలోని భైంసా పురపాలక సంఘంలో సోమవారం నిర్వహించిన పరోక్ష ఎన్నికల్లో నూతన చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌లను ఎన్నుకున్నారు. మున్సిపాలిటీ కార్యాలయంలో నిర్మల్ ఆర్డీఓ రత్న కళ్యాణి, అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది.

చైర్‌పర్సన్‌గా స్వతంత్ర అభ్యర్థి తూము దత్తాత్రి ఏకగ్రీవంగా ఎన్నిక కాగా, వైస్ చైర్‌పర్సన్‌గా బీబీ కుతిజ సిద్ధికా ఎన్నికైనట్లు అధికారులు అధికారికంగా ప్రకటించారు. ఎన్నికల అనంతరం కౌన్సిలర్లు, అధికారులు నూతనంగా ఎన్నికైన నాయకులను అభినందించారు. పట్టణ అభివృద్ధికి సమిష్టిగా కృషి చేస్తామని చైర్‌పర్సన్ దత్తాత్రి, వైస్ చైర్‌పర్సన్ బీబీ కుతిజ సిద్ధికా పేర్కొన్నారు. గత నాలుగు దశాబ్దాలుగా ఎంఐఎం ఆధిపత్యం కొనసాగిన భైంసా మున్సిపాలిటీలో ఈసారి రాజకీయ సమీకరణాలు మారాయి. తాజా ఫలితాల్లో ఎంఐఎం 12 స్థానాలు గెలుచుకోగా, బీజేపీ 6, కాంగ్రెస్ 1, స్వతంత్రులు 7 స్థానాలు సాధించారు. బీజేపీ, కాంగ్రెస్ మద్దతుతో పాటు ఎమ్మెల్యే ఎక్స్–అఫిషియో ఓటు సహకారంతో స్వతంత్ర కౌన్సిలర్లు చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ పీఠాలను కైవసం చేసుకున్నారు.

**హిందూ-ముస్లిం ఐక్యత నినాదాలు**

స్వతంత్ర అభ్యర్థులు గెలిచిన అనంతరం మున్సిపల్ కార్యాలయ ప్రాంగణం "హిందూ?ముస్లిం భాయ్ భాయ్" నినాదాలతో మార్మోగింది. భైంసా ఇకపై సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని వైస్ చైర్‌పర్సన్ భర్త మిర్జా ఇద్రిస్ బేక్ పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో ఇళ్ల అనుమతుల కోసం అనవసర రుసుములు లేకుండా పారదర్శక విధానాన్ని అమలు చేస్తామని నాయకులు హామీ ఇచ్చారు.

## మీనాంబరం శివాలయంలో ప్రత్యేక పూజలు

**జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్**





**జడ్చర్ల, అక్షిత న్యూస్ :** జడ్చర్ల మండలం అల్వాన్ పల్లి గ్రామంలో గల మీనాంబరం శివాలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని, ఆధ్యాత్మిక వాతావరణం నెలకొన్న వేళ, జడ్చర్ల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ మీనాంబరం శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే ఆలయం భక్తులతో కిటకిటలాడింది. శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ఈ సందర్భంగా ఎర్ర శేఖర్ శివయ్యకు అభిషేకాలు నిర్వహించి భక్తి శ్రద్ధలతో పూజల్లో పాల్గొన్న ఆయన, లోక కల్యాణం కోసం, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్ మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ ని శాలువాతో సత్కరించడం జరిగింది.

# నాగర్ కర్నూల్ మున్సిపాలిటీలో కొలువుదీరిన

# నూతన పాలకవర్గం

**నాగర్ కర్నూల్ మున్సిపల్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన తీగల సురేంద్ర**

**వైస్ చైర్మన్ గా బాదం రమేష్,**

**నాగర్ కర్నూల్ మున్సిపాలిటీలో నూతనంగా ఎన్నికైన 24 మంది సభ్యులను ప్రమాణ స్వీకారం**

**ప్రత్యేక అధికారి, నాగర్ కర్నూల్ ఆర్డీఓ సురేష్ బాబు**

**నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి:** నాగర్ కర్నూల్ మున్సిపల్ ఎన్నికలు ఫిబ్రవరి 11న జరిగిన మున్సిపాలిటీ ఎన్నికల్లో ఎన్నికైన 24 మంది నూతన సభ్యులను జిల్లా ఎన్నికల అథారిటీ, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆదేశాల మేరకు





నాగర్ కర్నూల్ మున్సిపాలిటీలో పరోక్ష విధానం ద్వారా చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక కొరకు సోమవారం మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో సభ్యుల ప్రమాణ స్వీకారం అనంతరం నూతన పాలకవర్గం కొలువుదీరింది. మున్సిపాలిటీ రెండవ సాధారణ ఎన్నికల్లో విజయం సాధించిన కౌన్సిలర్లు అందరికి ప్రత్యేక అధికారి ప్రమాణ స్వీకారం చేయించారు.

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఉదయం 11 గంటలకు ఆల్ఫాబెటికల్ ఆర్డర్లు ముందుగా కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ల, అనంతరం బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు ?ప్రమాణ స్వీకార కార్యక్రమం అనంతరం 12.30 గంటలకు చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ప్రక్రియ కూడా ప్రశాంతంగా ముగిసింది.

24 మంది సభ్యులున్న నాగర్ కర్నూల్ మున్సిపాలిటీ లో ?చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికకు, సమావేశానికి 18 మంది కాంగ్రెస్ సభ్యులు, 6 మంది బిఆర్ఎస్ సభ్యులు హాజరయ్యారు.

100 % కోరం సభ్యుల ప్రతిపాదన మేరకు అధికారులు చైర్ పర్సన్, వైస్ చైర్మన్ ఎన్నికను నిర్వహించారు.

ఈ ఎన్నికల్లో నాగర్ కర్నూల్ పురపాలిక చైర్ పర్సన్‌గా 23వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి తీగల సురేంద్ర పేరును 4వ వార్డు కౌన్సిలర్ సభ్యురాలు చింతలపల్లి వసంత ప్రతిపాదించగా 21వ వార్డు కౌన్సిలర్ పొగిడే శంకర్ బలపరిచారు.

మరో అభ్యర్థి పేరు ప్రతిపాదనకు రాకపోవడంతో తీగల సురేంద్ర ను చైర్ పర్సన్ గా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రత్యేక అధికారి ప్రకటించారు. అనంతరం వైస్ చైర్మన్ గా 8వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి బాదం రమేష్ పేరును 11వ వార్డు కౌన్సిలర్ సభ్యురాలు ఆసిఫా బేగం ప్రతిపాదించగా, 6వ వార్డు కౌన్సిలర్ మక్కలపల్లి శ్రీనివాసులు బలపరిచారు. మరో పేరు ప్రతిపాదనకు రాకపోవడంతో వైస్ చైర్మన్ గా బాదం రమేష్ ను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. అనంతరం ప్రత్యేక అధికారి చైర్మన్, వైస్ చైర్మన్ లను ప్రమాణ స్వీకారం చేయించారు.

నూతనంగా ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్, నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లను నాగర్ కర్నూల్ శాసనసభ్యులు డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ మునిసిపల్ కమిషనర్ నాగిరెడ్డి, తహసీల్దార్ తాబితారాణీ, ఎంపీడీవో చేన్నమ్మ, ఎన్నికల అధికారులు, మున్సిపల్ అధికారులు, ఎన్నికైన కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## దళితులను రక్షించేందుకు జాతీయ ఎస్సీ కమిషన్ ఎల్లప్పుడూ కృషి చేస్తుంది

**కర్ల రాజేష్ హత్య కేసుపై అధికారులపై జాతీయ ఎస్సీ కమిషన్ ఆగ్రహం..**

**కోదాడ అక్షిత ప్రతినిధి:** దళితులను రక్షించేందుకు జాతీయ ఎస్సీ కమిషన్ నిరంతరం కృషి చేస్తుందని జాతీయ షెడ్యూల్ కులాల కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచంద్ర రావు స్పష్టం చేశారు. సోమవారం కోదాడ పట్టణంలో ఇటీవల పోలీసు లాక్ ఆఫ్ డెత్ కు గురైన కర్ల రాజేష్ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా రాజేష్ తల్లి లలితమ్మతో రాజేష్ మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ నుండి మంజూరైన పెన్షన్ పత్రాన్ని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అడిషనల్ డీజీ చౌహాన్ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ సమక్షంలో రాజేష్ తల్లి లలితమ్మకు అందజేశారు.అనంతరం కోదాడ ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల





సమావేశంలో కమిషన్ సభ్యులు మాట్లాడుతూ, కర్ల రాజేష్ కేసు పత్రికల్లో చూసి జాతీయ ఎస్సీ కమిషన్ సుమోటో కింద కేసు నమోదు చేసిందన్నారు. కమిషన్ కేసులో ప్రవేశించిన అనంతరం ఎఫ్ఐఆర్ నమోదు చేశారని, రాజేష్ మృతి పై నేటి వరకు చార్జీ సీటు ఎందుకు వేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు చార్జిషీట్ కు సమయం కోరారని కాగా కమిషన్ చార్జిషీటు వెంటనే దాఖలు చేయాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. కేసులో బాధ్యులైన సిఐపై చర్య తీసుకోవడమే కాక, ఎస్సైపై వెంటనే చర్యలు తీసుకోవాలని అడిషనల్ డీజీ, జిల్లా ఎస్పీలని ఆదేశించారు. పది రోజుల్లో రీ పోస్టుమార్టం చేసి నివేదికను అందించాలని ఆదేశించారు.

1989 జాతీయ ఎస్సీ ఎస్టీ కమిషన్ సెక్షన్ 4 ప్రకారం కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా అధికారులు జవాబు ఇవ్వకపోతే నిర్లక్ష్యపు యాక్ట్ ప్రకారం సస్పెన్షన్ తో పాటు ఆరు నెలలు జైలు ఉంటుందని హెచ్చరించారు. రాజేష్ తల్లికి పెన్షన్ మంజూరు చేయడం జరిగిందని, మూడు రోజుల్లో ఉద్యోగం, డబుల్ బెడ్ రూమ్ ఇల్లు లేదా ఉన్న స్థలంలో ఇల్లు కట్టుకోవడానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని, మూడు ఎకరాల భూమి ఇచ్చేందుకు కలెక్టర్ అంగీకరించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వారి వెంట అడిషనల్ డిజి

డిఎస్ చౌహాన్, కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, ఎస్పీ నరసింహ, ఆర్డీవో సూర్యనారాయణ, డిఎస్పి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి దయానందరాణి, తదితరులు పాల్గొన్నారు.

## పురపాలక సంఘం కొల్లాపూర్ నూతనముగా ఎన్నికైన పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవము

**కొల్లాపూర్ మున్సిపల్ చైర్పర్సన్‌గా రెడ్డి జ్యోతిసత్యం**

**వైస్ చైర్మన్ గా రహీం భాష**




**కొల్లాపూర్, అక్షిత ప్రతినిధి:** కొల్లాపూర్ మున్సిపల్ చైర్పర్సన్ గా కాంగ్రెస్ పార్టీ 6 వార్డ్ కౌన్సిలర్ రెడ్డి జ్యోతి సత్యమును, 9 వార్డ్ కౌన్సిలర్ వైస్ చైర్మన్ గా షేక్ రహీం భాష ఎన్నికయ్యారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ముందుగా మున్సిపల్ పాలకవర్గం సభ్యులతో ఆర్డివో బన్సీలాల్ ప్రమాణ స్వీకారం చేయించారు. అంతకు ముందుకాంగ్రెస్ కు చెందిన 16 వార్డుల సభ్యులు ప్రమాణం చేశారు. అయితే చైర్పర్సన్ రేసులో 6వ వార్డు కౌన్సిలర్ రెడ్డి జ్యోతిని 8వ వార్డు కౌన్సిలర్ అన్వర్ ప్రతిపాదించగా 16వ వార్డు కౌన్సిలర్ బలపరిచారు. అయితే చైర్పర్సన్ పీఠంకు 18వ వార్డు కౌన్సిలర్ శ్రీదేవి గౌతమ్ గౌడ్ పోటికి దిగింది. శ్రీదేవి గౌతమ్ గౌడ్ కు 13వ వార్డు కౌన్సిలర్ వంగ అనూష రాజశేఖర్ గౌడ్ ప్రతిపాదించగా, కౌన్సిలర్ ఎవరు బలపరిచినందున సమావేశం నుంచి శ్రీదేవి గౌతమ్ గౌడ్ ఎన్నికైనట్లు లాంఛనంగా ఎన్నికల అధికారి బాన్సిలాల్ ప్రకటించారు. వైస్ చైర్మన్ గా పోటీలోకి దిగిన రహీం భాషకు 14వ వార్డు కౌన్సిలర్ సిబ్బది నరసింహ రావును ప్రతిపాదించగా, 5వ వార్డు కౌన్సిలర్ రమ్యకుమారి బలపరచడంతో రహీం పాషా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి బాన్సులాల్ ప్రకటించారు. అనంతరం చైర్ పర్సన్, వైస్ చైర్మన్ తో అధికారి బాన్సులాల్ ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం వారు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావుగా కి పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి అభినందించారు.

## ప్రశాంతంగా ఆసిఫాబాద్ మున్సిపాలిటి చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కే హరిత**



**ఆసిఫాబాద్. అక్షిత ప్రతినిధి:** ఆసిఫాబాద్ మున్సిపాలిటి చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక, ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించినట్టు జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ హరిత అన్నారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ భవన సముదాయం లోని సమావేశ మందిరం నుండి వెబ్ కాస్టింగ్ ద్వారా ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ , వైస్ చైర్మన్ ఎన్నిక, ప్రక్రియను కలెక్టర్ కే హరిత, ఎస్ పి నితికా పంత్, అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, ఎం డెవిడ్ తో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ మాట్లాడుతూ ఆసిఫాబాద్ మున్సిపాలిటి లోని చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికను ప్రశాంతంగా నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఎల్లాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమనీలో సంబందిత శాఖల అధికారులు, తధీ తరులు పాల్గొన్నారు.

www.aakshitha.com People's voice అక్షిత AKSHITHA NATIONAL DAILY



# మిర్యాలగూడ మున్సిపాలిటీలో మైనారిటీలకు తీవ్ర అన్యాయం

**వైస్ చైర్మన్ ఇవ్వక పోవడంపై తీవ్ర నిరసన**

**జామియతే ఉలేమా రాష్ట్ర అధ్యక్షులు మౌలానా ఎహ్సానుద్దీన్**



**మిర్యాలగూడ, అక్షిత ప్రతినిధి :** మిర్యాలగూడ మున్సిపాలిటీలో మైనారిటీలకు జరిగిన తీవ్రమైన అన్యాయం రాజకీయ, సామాజిక వర్గాల్లో తీవ్ర ఆందోళనను కలిగిస్తోంది. నల్గొండ జిల్లాలోని మిర్యాలగూడ మున్సిపల్ ఎన్నికల్లో మొత్తం 48 వార్డులలో కాంగ్రెస్ పార్టీ తరఫున 8 మంది మైనారిటీ అభ్యర్థులకు బీ?ఫారమ్‌లు జారీ చేయగా, వారిలో 7 మంది ఘన విజయం సాధించారు.

ఇంత స్పష్టమైన ప్రాతినిధ్యం ఉన్నప్పటికీ, మున్సిపల్ ఉపాధ్యక్ష పదవిని ఏ ఒక్క మైనారిటీ కౌన్సిలర్‌కూ ఇవ్వకపోవడం మైనారిటీలపై జరిగిన బహిరంగ అన్యాయం, హామీల ఉల్లంఘనగా తీవ్ర విమర్శలకు దారితీసింది. ఈ రోజు మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు జరిగాయి.

ఎన్నికలకు ముందు రాష్ట్ర స్థాయి జమియత్ ఉలేమా నేతలు, మైనారిటీలకు ఉన్న సంఖ్యాబలం, రాజకీయ విశ్వాసాన్ని దృష్టిలో ఉంచుకుని వైస్ చైర్మన్ పదవిని మైనారిటీ కౌన్సిలర్‌కు ఇవ్వాలని నిరంతరం ప్రతినిధిత్వం చేసినట్లు తెలిపారు.

2023 అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ అభ్యర్థికి అందజేసిన వ్రాతపూర్వక వినతిపత్రంలో, అధికారంలోకి వచ్చిన తర్వాత మైనారిటీలకు గౌరవప్రద ప్రాతినిధ్యం కల్పిస్తామని, అందులో మున్సిపల్ వైస్ చైర్మన్ పదవి ఉంటుందని స్పష్టంగా పేర్కొనబడిందని వారు గుర్తు చేశారు.

మున్సిపల్ ఎన్నికల అనంతరం జమియత్ ఉలేమా బాధ్యులు జిల్లా మంత్రులు, ప్రజాప్రతినిధులు, పార్టీ సీనియర్ నేతలతో సమావేశమై ఈ డిమాండ్‌ను మళ్లీ పునరుద్ఘాటించారు. స్థానిక ఎమ్మెల్యేకు మిర్యాలగూడ మున్సిపాలిటీలో ఉపాధ్యక్ష పదవిని తప్పనిసరిగా మైనారిటీ కౌన్సిలర్‌కు ఇవ్వాలని స్పష్టమైన సూచనలు చేసినట్లు సమాచారమన్నారు.

అయితే అన్ని సూచనలు, వాగ్దానాలను పూర్తిగా విస్మరించి, వైస్ చైర్మన్ పదవికి మైనారిటీ కౌన్సిలర్‌ను ఎంపిక చేయకపోవడం పట్ల మైనారిటీ వర్గాలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయన్నారు. రాజకీయ హామీల ఉల్లంఘనే కాకుండా, మైనారిటీల సమూహ అవమానంగా అభివర్ణించారు. మిర్యాలగూడలో మైనారిటీలు కాంగ్రెస్ పార్టీపై పూర్తి విశ్వాసం ఉంచారని, కానీ దానికి ప్రతిఫలంగా నిర్లక్ష్యం ఎదురవుతోందన్నారు.

అన్యాయానికి తక్షణ పరిష్కారం లభించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ వ్యవహారాన్ని వెంటనే పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మైనారిటీలను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే చూడటం, అధికారంలోకి వచ్చిన తర్వాత పక్కన పెట్టడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు. మైనారిటీల న్యాయమైన డిమాండ్లను నిర్లక్ష్యం చేస్తే, ఈ విషయం మిర్యాలగూడకే పరిమితం కాకుండా రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ ప్రభావాలు చూపుతుందని హెచ్చరించారు.

పార్టీ అధిష్టానం నిర్ణయాన్ని గంభీరంగా పునఃపరిశీలించాలని, లేకపోతే రానున్న ఎన్నికల్లో దాని ఫలితాలు తప్పక కనిపిస్తాయని స్పష్టం చేశారు.

# మధిర మున్సిపల్ పీఠం హస్తం కైవసం

**చైర్‌పర్సన్‌గా సామినేని సుజాత వైస్ చైర్మన్‌గా కోన ధని కుమార్ ఎన్నిక**

**హాజరైన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**

**ఎక్స్ అఫీషియో ఓటు వినియోగం**



**ఖమ్మం /అక్షిత బ్యూరో :** మధిర మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ తన ఆధిపత్యాన్ని చాటుకుంది.పట్టణ ప్రథమ పౌరురాలిగా సామినేని సుజాత, వైస్ చైర్మన్‌గా కోన ధని కుమార్ ఎన్నికయ్యారు. సోమవారం మధిర ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన ఎన్నికల ప్రక్రియలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పాల్గొని తన ఎక్స్ అఫీషియో ఓటును వినియోగించుకున్నారు.

**ముందుగా అభినందనల వెల్లువ**

అంతకుముందు మధిరలోని తన క్యాంపు కార్యాలయంలో నూతనంగా గెలిచిన కాంగ్రెస్ కౌన్సిలర్లను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సాదరంగా ఆహ్వానించారు. భారీ మెజారిటీతో విజయం సాధించినందుకు వారిని అభినందించిన ఆయన ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పట్టణ అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని సూచించారు. అనంతరం క్యాంపు కార్యాలయం నుంచి కౌన్సిలర్లతో కలిసి ఎంపీడీవో కార్యాలయానికి చేరుకున్నారు.

**ప్రమాణ స్వీకారం.. ఎక్స్ అఫీషియో ఓటు**

ఎంపీడీవో కార్యాలయంలో ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో నూతన కౌన్సిలర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్ ఎన్నిక కోసం జరిగిన ప్రక్రియలో భట్టి విక్రమార్క తన ఎక్స్ అఫీషియో ఓటును వేశారు. మెజారిటీ సభ్యుల మద్దతుతో చైర్‌పర్సన్ పదవికి సామినేని సుజాత, వైస్ చైర్మన్ పదవికి కోన ధని కుమార్ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి నవీన్ బాబు అధికారికంగా ప్రకటించారు.

**అభివృద్ధికి బాటలు వేస్తాం: భట్టి**

ఎన్నిక అనంతరం భట్టి విక్రమార్క మాట్లాడుతూ మధిర మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరేలా చూస్తామని ప్రజలు కాంగ్రెస్ పార్టీపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పని చేయాలని కౌన్సిలర్లకు సూచించారు. నూతనంగా ఎన్నికైన పాలకవర్గానికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు.





# మదీనాగూడ డివిజన్ అభివృద్ధి లక్ష్యంగా ముందడుగు వేస్తున్న మిద్దెల మల్లారెడ్డి..



**శేరిలింగంపల్లి అక్షిత ప్రతినిధి:** మియాపూర్ సర్కిల్ లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో డిప్యూటీ కమిషనర్ శశిరేఖ ని కలిసి మదినగూడ డివిజన్ ప్రజలు ఎదుర్కొంటున్న ముఖ్యమైన సమస్యలలో మదినగూడ డివిజన్ పరిధిలోని మంజీరా రోడ్డులో స్ప్రింగ్ వాల్యూ స్కూల్ ముందు ఉన్న డ్రైనేజ్ ని కల్వర్టుగా మార్చే విధంగా చూడాలని కోరిన మిద్దెల మల్లారెడ్డి. మదినగూడ డివిజన్ పరిధిలోని మైత్రి నగర్ ఫేజ్ 3 లో గల పార్క్ ను అభివృద్ధి చేయమని కోరిన మిద్దెల మల్లారెడ్డి. నిరంతరం ప్రజల క్షేమమే ధ్యేయంగా ముందుకెళుతూ మదినగూడ డివిజన్ ను భవిష్యత్తులో సేవచేసే అవకాశం ఇస్తే గ్రేటర్ హైదరాబాద్ లోనే అత్యుత్తమ డివిజన్ గా తీర్చిదిద్దుతామని తెలియ జేశారు మిద్దెల మల్లారెడ్డి. ఏ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకువస్తే అధికారులతో సమన్వయపరిచి సమస్యను క్లియర్ చేసే విధంగా చూస్తానని తెలియపరుస్తున్న మల్లారెడ్డి. భవిష్యత్తులో ప్రజలు మదీనాగూడ డివిజన్ కు సేవ చేసుకునే విధంగా దీవించి ముందుకు నడపాలని మిద్దెల మల్లారెడ్డి కోరారు.

# హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా దండి లక్ష్మీ ఏకగ్రీవం

**ఎక్స్ ఆఫీస్ హోదాలో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్**



**హుస్నాబాద్ అక్షిత ప్రతినిధి:** హుస్నాబాద్ మున్సిపాలిటీలో చైర్మన్ ఎన్నికల సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక సమావేశం శాంతియుతంగా, ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి మొత్తం 20 మంది సభ్యులతో పాటు ఒక ఎక్స్అఫిషియో సభ్యులు రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ హాజరయ్యారు.

చైర్‌పర్సన్ పదవికి 14వ వార్డు సభ్యురాలు దండి లక్ష్మీ పేరును చెన్నమేని అనూష ప్రతిపాదించగా, ఆకుల రజిత, కేశవేని రమేష్, శోభన్ బాబు తదితర సభ్యులు బలపరిచారు. అనంతరం జరిగిన చర్చల్లో సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమెకు మద్దతు ప్రకటించారు. సభ్యుల సంపూర్ణ సమ్మతితో దండి లక్ష్మిని ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ తరఫున హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రత్యేక అధికారి ఆర్డీవో రామ్మూర్తి దండి లక్ష్మితో అధికారికంగా ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఆమెకు సభ్యులు శుభాకాంక్షలు తెలియజేశారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన దండి లక్ష్మి మాట్లాడుతూ, "ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, హుస్నాబాద్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తాను. పారిశుద్ధ్యం, తాగునీరు, రోడ్లు, విద్యుత్, డ్రైనేజీ వంటి మౌలిక వసతుల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి పెడతాను" అని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని అభివృద్ధి పనులను వేగవంతం చేయడంతో పాటు, పేదలు, మహిళలు, యువత సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తామని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ తో పాటు పలువురు కౌన్సిలర్లు పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజాప్రతినిధులు పాల్గొని నూతన చైర్‌పర్సన్‌కు అభినందనలు తెలిపారు.

# లక్ష్మాపురంలో జీవన వైవిధ్య యాజమాన్య కమిటి ఎన్నిక

**పకృతి పరిరక్షణ మన సంస్కృతి మన భవిష్యత్తుతో ముడిపడి ఉంది**

**జీవరాసుల సమతుల్యత దెబ్బతింటే విపత్తులు తప్పవు**

**రసాయన ఎరువులు కీటక నాశక మందులతో నేల నీటి కాలుష్యం పెరుగుతుంది**

**సేంద్రియ వ్యవసాయాన్ని ప్రతి రైతు పాటించాలి**

**మన గ్రామం మన వృక్ష జంతు నీటి వనరులను నమోదు చేసుకోవాలి**

**స్థానిక విత్తన సంపద కాపాడేందుకు విస్తన్న బ్యాంకులు ఏర్పాటు చేయాలి**

**ప్లాస్టిక్ వినియోగం తగ్గించి పక్షి జంతువుల వేట నిషేధం కట్టుదిట్టంగా అమలు చేయాలి**

**జిల్లా వైవిధ్య మండలి సమన్వయకర్త ఇ. శ్రీనివాస్**

**గ్రామ సర్పంచ్ గుగులోత్ రవీందర్ నాయక్**





**నాగారం అక్షిత న్యూస్ :** మండల పరిధిలోని లక్ష్మాపురం గ్రామంలో ఏర్పాటుచేసిన జీవన వైవిధ్య యాజమాన్య కమిటీ సమావేశంలో జీవన వైవిధ్య మండలి జిల్లా సమన్వయకర్త ఇ. శ్రీనివాస్ మాట్లాడుతూ పక్రృతి పరిరక్షణ అవసరాన్ని హృదయాన్ని హత్తుకునే విధంగా వివరిస్తూ జీవన వైవిధ్యం అనేది కేవలం ఒక చట్టపరమైన పదం కాదని, అది మన సంస్కృతి, మన సంప్రదాయం, మన జీవన విధానం, మన ఆహారం, మన ఆరోగ్యం, మన భవిష్యత్తుతో ముడిపడి ఉన్న మహత్తర అంశమని తెలిపారు. భూమిపై ఉన్న ప్రతి మొక్క, ప్రతి చెట్టు, ప్రతిపక్షి, ప్రతి జంతువు, ప్రతి క్రిమి కీటకం, అడవులు, గుట్టలు, నదులు, చెరువులు, భూగర్భ జలాలు, ఖనిజ సంపద, ఇవన్నీ కలిసే జీవన వైవిధ్యం అని అన్నారు. జీవరాసుల మధ్య సహజ సమతుల్యత దెబ్బతింటే పకృతి విపత్తులు, వాతావరణ మార్పులు, కరువు, వరదలు, అనారోగ్య సమస్యలు పెరుగుతాయని అన్నారు. గతంలో మన పూర్వీకులు పకృతిని దేవతగా భావించి సంరక్షించారని, చెట్లను నరికి వేయకుండా పూజించారని, జంతువులను హింసించకుండా పరిరక్షించారని గుర్తు చేశారు. సేంద్రీయ వ్యవసాయం ద్వారా పండించిన పంటలు పోషక విలువలతో నిండి ఉండేవని, ఆహారం స్వచ్ఛంగా ఉండటంతో మనుషుల ఆరోగ్యం బలంగా ఉండేదని తెలిపారు. కానీ నేడు అధిక లాభాల కోసమే రసాయన ఎరువులు, కీటక నాశక మందులు అధికంగా వాడటం వల్ల నేల నాణ్యత క్షీణించిందని, నీటి వనరులు కలుషితమయ్యాయని, ఆహార పదార్థాలలో విష పదార్థాలు చేరి అనేక రకాల వ్యాధులు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ సర్పంచ్ గుగులోత్ రవీందర్ నాయక్ మాట్లాడుతూ జీవరాసులు అంతరించిపోవడం అనేది మానవ సమాజానికి ఒక హెచ్చరిక అని, ఒక పక్షి జాతి కనుమరుగైతే అది కేవలం ఒక జీవి అంతరించిపోవడం కాదు, పకృతి చక్రంలో ఒక గొలుసు తెగిపోవడమేనని అన్నారు. అదేవిధంగా ఒక అడవి నాశనం అయితే అది వందలాది జీవరాసుల నివాసం కోల్పోవడమేనని తెలిపారు. జీవన వైవిధ్య యాజమాన్య కమిటీలు గ్రామస్థాయిలో ప్రజల భాగస్వామ్యంతో సహజ వనరుల పరిరక్షణకు మనమంతా కృషి చేయాలని తెలిపారు. ప్రతి గ్రామం తన పరిధిలో ఉన్న వృక్ష సంపద, ఔషధ మొక్కలు, జంతు సంపద, నీటి వనరులు, పంటల వైవిధ్యం గురించి నమోదు చేసుకొని వాటిని సంరక్షించేందుకు మనమంతా కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. విత్తన బ్యాంకులు ఏర్పాటుచేసి స్థానిక విత్తన సంపాదన కాపాడాలని, సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, జంతువుల, పక్షుల వేత నిషేధాన్ని కట్టుదిట్టంగా అమలు చేయాలని పిలుపునిచ్చారు. పారిశ్రామిక వ్యర్థాలను నియంత్రించకుండా వదిలేస్తే భూమి, గాలి, నీరు కలుషితమవుతాయని, దాని ప్రభావం మన ఆరోగ్యం పై తీవ్రంగా పడుతుందని హెచ్చరించారు. గ్రామ ప్రజలందరూ కలిసి చెరువులు, కుంటలు, కాలువలు శుభ్రపరచాలని, ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్క నాటి దాన్ని సంరక్షించాలని సూచించారు. జీవన వైవిధ్య సంరక్షణ అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి కర్తవ్యం అని స్పష్టం చేశారు. మనం పకృతిని కాపాడితేనే పకృతి మనల్ని కాపాడుతుందని, భవిష్యత్తు తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణం అందించాలంటే జీవన వైవిధ్య సంరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. గ్రామ జీవన వైవిధ్య యాజమాన్య కమిటీ చైర్మన్ గా గ్రామ సర్పంచ్ గుగులోత్ రవీందర్ నాయక్, కమిటీ సభ్యులుగా గ్రామ ఉపసర్పంచ్ గండెల లలిత రాములు, గ్రామపంచాయతీ కార్యదర్శి బి. గోపి, వార్డు సభ్యులు మల్లెపాక వెంకటయ్య, మాజీ ఉపసర్పంచ్ తడకమల్ల నాగమల్లయ్య, చిప్పలపెల్లి ముత్తయ్య, పొదిల రేణుక లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

# ఫెర్టిలైజర్ యాప్‌తో రైతన్నల అవస్థలు

**యూరియా కోసం**

**రైతన్నకు తప్పని తిప్పలు**



**ఆత్మకూర్(ఎం)అక్షిత న్యూస్:** మండల కేంద్రంలోని మన గ్రోమోర్ సెంటర్ వద్ద యూరియా కోసం రైతుల ఆందోళన రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి అందించే యూరియా బస్తాల కోసం ముందస్తుగా బుకింగ్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది,స్మార్ట్ ఫోన్లో బుకింగ్ చేసుకునే విధానంపై పూర్తిస్థాయిలో అవగాహన లేని రైతన్నలు దీనివల్ల ఇబ్బందులు పడుతున్నారు. పిఎసిఎస్,మన గ్రోమోర్ సెంటర్ వద్ద రైతులు యూరియా కోసం బారులు తీరారు.అధికారులు యాప్‌పై అవగాహన కల్పించినా రైతులు యాప్‌లో నమోదు, ఆధార్ లింక్,బయోమెట్రిక్ సరిగా చేయడం తెలియక గంటల తరబడి ఎదురుచూడాల్సి వస్తున్నది. కేవలం కొన్ని నిమిషాల వ్యవధిలోనే వందల బస్తాలు అమ్ముడు అయిపోవడం ఆశ్చర్యంగా అనిపిస్తుందని రైతులు వాపోతున్నారు.ఈ కొత్త పద్ధతి ద్వారా రైతులకు అన్యాయమే జరిగిందని పంటకు అవసరమైన యూరియా దొరకడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇట్టి యూరియా విషయంపై మండల వ్యవసాయ అధికారిని ఫోన్ ద్వారా వివరణకు సంప్రదించగా స్పందన రాలేదు..

## విమర్శిస్తే నోటీసులా? నోటికి నల్ల రిబ్బన్లతో నిరసన

**రాహుల్ గాంధీ, రేణుక చౌదరి లకు ఇచ్చిన నోటీసులు వెనక్కి తీసుకోవాలని డిమాండ్**

**కేంద్ర ప్రభుత్వం ప్రతిపక్షాల గొంతు నొక్కే ప్రయత్నాలుమానుకోవాలి.గురిజాల గోపి**

**అంబేద్కర్ సాక్షిగా నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకొని నిరసన కార్యక్రమం**



**భద్రాద్రి కొత్తగూడెం, అక్షిత ప్రతినిధి:** మణుగూరులోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గురజాల గోపి ఆధ్వర్యంలో సోమవారం వినూత్న రీతిలో మౌన నిరసన కార్యక్రమం ను కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు.నాయకులు తమ నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకొని కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఆందోళన వ్యక్తం చేశారు.కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆరోపిస్తూ, ముఖ్యంగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాహుల్ గాంధీ , రేణుక చౌదరిలకు జారీ చేసిన సభా ఉల్లంఘన నోటీసులను తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ నాయకుడు గురిజాల గోపి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను పక్కనబెట్టి ప్రతిపక్షాల గొంతును నొక్కే ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. సీనియర్ నాయకులపై అనవసర ఆరోపణలు చేయడం సరైన విధానం కాదని, ఇది ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని విమర్శించారు.ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని, ప్రభుత్వం తీసుకున్న చర్యలను వెనక్కి తీసుకునే వరకు నిరసనలు కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో రేణుక అక్షర మహిళా మండలి అధ్యక్షురాలు పూనెం సరోజ, ఎండి షబానా, కోరి శ్యామల, దేరంగుల సుజాత, రెడ్డిబోయిన రేణుక, కన్నాపురం శైలజ, సౌజన్య దాకూరి, లక్కీశెట్టి హేమలత, అలాగే సీనియర్ నాయకులు ఎండీ షేరిఫ్, పింగళి మాధవ రెడ్డి, వెంకట చారి తదితరులు,యువజన నాయకులు, పార్టీ కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకొని చేపట్టిన ఈ మౌన నిరసన కార్యక్రమం స్థానికంగా చర్చనీయాంశమైంది.

## దేవరకద్ర పుర పీఠం హస్త గతం



**దేవరకద్ర ,అక్షిత న్యూస్ :** దేవరకద్ర మున్సిపల్ చైర్మన్ గా ఎన్నికైన దమయంతి కి, వైస్ చైర్మన్ గా ఎన్నికైన యుగంధర్ రెడ్డికి, కాంగ్రెస్ కౌన్సిలర్లకు శుభాకాంక్షలు తెలియజేసిన దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి తదనంతరం ఎమ్మెల్యే జియంఆర్ మాట్లాడుతూ... మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అద్భుతమైన విజయాన్ని అందించిన దేవరకద్ర, కొత్తకోట, భూత్పూర్ మున్సిపాలిటీ ప్రజలకు ధన్యవాదాలు తెలియజేశారు.

ఈ ఎన్నికల ఫలితాలే రాబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పునరావృతం అవుతాయని, రాష్ట్రంలో మరోసారి రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని తెలిపారు, ప్రజలు అభివృద్ధికి పట్టం కట్టారని అన్నారు. నూతనంగా ఎన్నికైన మున్సిపాలిటీ చైర్మన్ లు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ, కష్టపడి పని చేసి ప్రజల మన్ననలు పొందాలని కోరారు.

www.aakshitha.com People's voice అక్షిత AKSHITHA NATIONAL DAILY జాతీయ దినపత్రిక



# పుర ఎన్నికలలో నైతిక విజయం కాంగ్రెస్‌దే...

**బీఆర్ఎస్ బీజేపీ అనైతిక రాజకీయాలు**

**బీసీ బిడ్డను ఎదగనియ్యకుండా పన్నాగాలు**

**మెదలు పట్టి గెంటేసినా పార్టీ కి ఎంపీ రఘునందన్ మద్దతు**

**ఓటమితో కుంగిపోయేది లేదు**

**కలిసికట్టుగా కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తాం**

**13 మంది కౌన్సిలర్లను ఘనంగా సన్మానం**

**వారి పోరాటానికి ఐకమత్యానికి అభినందనలు**

**మెదక్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఇన్చార్జి నీలం మధు ముదిరాజ్**



**పటాన్‌చెరు అక్షిత ప్రతినిధి:** ఇస్నాపూర్ మున్సిపాలిటీ చైర్మన్ ఎన్నికలో నైతిక విజయం కాంగ్రెస్ పార్టీ దేనని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ నీలం మధు ముదిరాజ్ అన్నారు.సోమవారం ఇస్నాపూర్ మున్సిపల్ ఎన్నికల చైర్మన్ ఎన్నిక అనంతరం ఆయన ప్రెస్ నోట్ విడుదల చేశారు.బీసీ బిడ్డ ఎదుగుదలను ఓర్చుకోలేక ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి,ఎంపీ రఘునందన్ రావు కుమ్మక్కు రాజకీయాలకు తెర లేపారని ఆరోపించారు.పొద్దున లేస్తే టీవీ ఛానల్లో బీఆర్ఎస్ పై హరీష్ రావు పై ఆరోపణలు చేసే దొర రఘునందన్ రావు మళ్ళీ ఆ దొర కాళ్ళ దగ్గర బానిసగా మారిపోయాడని విమర్శించారు.దీన్నిబట్టి ఎంపీ ఎన్నికల్లో హరీష్ రావు,రఘునందన్ రావు, ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అనైతిక బంధం నేడు బట్టబయలు అయిందని తెలిపారు.ఎంపీ రఘునందన్ మెడలు పట్టి బయటకు గెంటిన పార్టీకి మున్సిపల్ ఎన్నికల్లో ఎక్స్ అఫిషియో ఓటు వేయడం ఆయన మనస్సాక్షికే వదిలేస్తున్నామని వ్యాఖ్యానించారు. ఓటమితో కలత చెంది కుంగిపోయే మనస్తత్వం తనది కాదని మళ్లీ ప్రజాక్షేత్రంలో ప్రజల కోసం పనిచేసే కాంగ్రెస్ అభివృద్ధి కోసం కష్టపడతామని స్పష్టం చేశారు.ఇస్నాపూర్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చిన కౌన్సిలర్లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపి ఘనంగా సత్కరించారు.చైర్మన్ సీటు చేజారినంత మాత్రాన కార్యకర్తలు ఎవరు నిరుత్సాహ పడవద్దని రాష్ట్రంలో మన కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉందని ప్రభుత్వ సహకారంతో ప్రజలకు కావలసిన అభివృద్ధి కార్యక్రమాలను సాధించుకుందామని తెలిపారు.కాంగ్రెస్ పార్టీని నమ్మి ఓటేసిన ప్రజలందరికీ ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు,కాంగ్రెస్ శ్రేణులు తదితరులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## మిత్రుడి కుటుంబానికి పూర్వ విద్యార్థుల చేయూత



**తిరుమలగిరి, అక్షిత ప్రతినిధి :** తిరుమలగిరి మండల కేంద్రం వెలిశాల గ్రామంలో కష్టాల్లో ఉన్న చిన్ననాటి మిత్రుడికి అండగా నిలిచి తమ స్నేహాన్ని చాటుకున్నారు. వెలిశాల గ్రామ విద్యార్థులు. ఇటీవల తండ్రిని కోల్పోయిన పుల్లూరి శ్రీను కుటుంబాన్ని 2011-12 పదో తరగతి బ్యాచ్ మిత్రులు ఆదివారం పరామర్శించారు. మిత్రుడి కుటుంబం ఇబ్బందుల్లో ఉందని తెలుసుకున్న వారంతా కలిసి తమ వంతు సహాయంగా రూ.11,000 నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో సైదులు, హరీశ్, ప్రశాంత్, మహేశ్, భాస్కర్, నరేశ్, రాజు, శోభన్, యాకుబ్, హైమత్ పాషా, మధు, రమేష్ పాల్గొన్నారు.

## పేదలకు ఇచ్చిన జాగాల్లోనే ఇందిరమ్మ ఇళ్లు

**కాలనీ సమస్యలపై లక్ష్మారెడ్డి క్షేత్రస్థాయి పర్యటన**

**బడంగ్ పేట 119 సర్వేనంబర్ పేదలకు కేఎల్ఆర్ భరోసా**

**ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుడితో మిఠాయిల పంపిణీ**



**మహేశ్వరం, అక్షిత ప్రతినిధి:** రంగారెడ్డి జిల్లా, కాంగ్రెస్ హయాంలో పేదలకు ఇచ్చిన జాగాల్లోనే ఇందిరమ్మ ఇళ్లు సైతం కట్టించి ఇస్తామని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారు.

కాలనీ సమస్యలు, బడంగ్ పేటలో 119 సర్వేనంబర్ లో స్థలాలు ఉన్న లబ్ధిదారులతో బస్తీబాట నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ సమస్యలు, పేదల ఇళ్లపై వచ్చిన సమస్యలను స్థానిక అధికారుల దృష్టికి తీసుకెళ్లారు కేఎల్ఆర్

విద్యుత్, రోడ్లు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించేందుకు ప్రతీ కాలనీలను పరిశీలించాలని స్థానిక కాంగ్రెస్ నాయకులకు కిచ్చెన్నగారు సూచించారు. నాదర్ గుల్ డివిజన్ లో అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపాలని జిహెచ్ఎంసి అధికారులను లక్ష్మారెడ్డి కోరారు.

ఈ కార్యక్రమంలో నాదర్ గుల్, బడంగ్ పేట, బాలాపూర్ డివిజన్ నాయకులు సహా మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ శ్రేణులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పాశం శ్రీను 16వ వర్ధంతి




**వలిగొండ/ అక్షిత న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం లోని పులిగిల్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా సెక్రటరీ పాశం స్వామి కుమారుడైన కీర్తిశేషులు పాశం శ్రీను 16 వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పల్లెర్ల బిక్షపతి వేముల నరసింహ రాచమల్ల లక్ష్మీనర్సు తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్లో నూనెలు సలసల




**కాజీపేట్, అక్షిత ప్రతినిధి :** మార్కెట్లో వంట నూనె ధరలు మండిపోతున్నాయి. ఒకసారి పెరిగి సామాన్యులకు మధ్యతరగతి ప్రజలకు షాకిస్తున్నాయి. ముఖ్యంగా కిలో వేరుశనగ నూనె 180 రూపాయలు, కిలో సన్ ఫ్లవర్ ఆయిల్ 165 రూపాయలకు చేరాయి. కొద్దిరోజుల క్రితం ధరలు తక్కువగా ఉండగా ఒక్కసారిగా ఎగబాకాయి. వీటితోపాటు పప్పు దినుసుల ధరలు పెరగడంతో వినియోగదారులకు వంట భారంగా మారింది.

**ఒక్కసారిగా పెరిగి...**

గత నెల వేరుశనగ నూనె 145 రూపాయలు ఉండగా అమాంతరం కిలో 30 రూపాయలు పెరిగి 180 రూపాయలకు చేరుకుంది. సన్ఫ్లవర్ ఆయిల్ కిలోకి 20 రూపాయలు పెరిగి 142 నుండి 165 కీ పెరిగింది. కిలో కందిపప్పు 125 రూపాయలు, పెసరపప్పు 110 రూపాయలు, కిలో ఎండుమిర్చి 250 రూపాయల నుండి 300 రూపాయలకు విక్రయిస్తున్నారు.

**చిరు వ్యాపారులపై ప్రభావం**

ధరల పెరుగుదలతో పేద మధ్యతరగతి ప్రజలతో పాటు హోటల్లు, రెస్టారెంట్లు, స్ట్రీట్ ఫుడ్ వ్యాపారాలు చేసే వ్యాపారులపై భారం పడింది. చిరు వ్యాపారులు తమ వంటకాలలో ఎక్కువగా నూనెను వినియోగిస్తుంటారు. ధరల పెరుగుదలతో ఖర్చులు పెరిగి ఆదాయం తగ్గుతుందని వినియోగదారులు వాపోతున్నారు. ప్రభుత్వం ధరల నియంత్రణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



## పి ఎ సి చైర్మన్ అరికేపూడి గాంధీచే శివలింగాష్టకం ఆడియో విడుదల..

**స్వర్ణమహతి సంగీతాలయా ఆధ్వర్యంలో..**



**శేరిలింగంపల్లి అక్షిత ప్రతినిధి:** భక్తి, భావం, బాలప్రతిభల సమ్మేళనంగా స్వరమహతి సంగీతాలయ సంస్థ వారి లిటిల్ చాంప్స్ గ్రూప్ రూపొందించిన తొలి ఆధ్యాత్మిక సంగీత ప్రాజెక్ట్ "శివ లింగాష్టకం" ఆడియోను పి ఎ సి చైర్మన్ ఆరెకపూడి గాంధీ చేతుల మీదుగా వారి నివాసంలో ఆవిష్కరించడం జరిగినది. ఈ సందర్భంగా పి ఎ సి చైర్మన్ గాంధీ మాట్లాడుతూ అతి పిన్న వయసులో బాలలు అద్భుత భక్తి పరవశంతో కూడిన ఆల్బమ్ ను రూపొందించడం చాలా గొప్ప విషయం అని , వారిని ప్రత్యేకంగా అభినందిస్తున్నాను అని పి ఎ సి చైర్మన్ గాంధీ తెలియచేసారు.భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని పిల్లలను ఆశీర్వదించడం జరిగినది. నిర్వాహకులు మాట్లాడుతూ పిఎ సి చైర్మన్ గాంధీ ఆశీర్వచనాలు, ప్రోత్సాహక మాటలు మా చిన్నారులకు ఎంతో ప్రేరణనిచ్చాయి. కార్యక్రమంలో కళాకారులు, తల్లిదండ్రులు పాల్గొని వేడుకను విజయవంతం చేశారు.ఈ పవిత్ర భక్తి గీతాన్ని మా లిటిల్ చాంప్స్ వివిక్త, మైరా, రియాన్ష్, లూషా, కాత్యాయనీ, దివిషా, పునర్వి ఎంతో భక్తి, శ్రద్ధలతో ఆలపించారు. వారి కృషి, క్రమశిక్షణ, అంకితభావం ఈ ప్రాజెక్ట్ విజయానికి కారణమయ్యాయి. ఈ కార్యక్రమంలో చిన్నారుల తల్లిదండ్రులతో పాటు శ్రీ నటరాజ్ గుప్తా మరియు స్వరమహతి కళాపరిషత్ సభ్యులు పాల్గొన్నారు.

ఈ గీతం ప్రముఖ డిజిటల్ సంగీత వేదికలైన స్పటిఫై, జియో శవాన్, ఆపిల్ మ్యూజిక్ , అమెజాన్ మ్యూజిక్ లలో వినడానికి అందుబాటులో ఉంది.

మా సంస్థకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తున్న తల్లిదండ్రులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. మా చిన్నారుల భవిష్యత్ సంగీత ప్రయాణానికి మీ అందరి ఆశీస్సులు, ప్రోత్సాహం కోరుకుంటున్నాము అని డా. బందనపూడి ఆదిత్య కిరణ్ స్వరమహతి సంగీతాలయ నిర్వాహకులు కోరారు.